# ఓయూ కీర్తి పతాకను ఎగురేద్దాం
# ఆర్ట్స్ కాలేజీని జ్ఞాన కేంద్రంగా నిలబెడుదాం

**"ఉస్మానియా విశ్వవిద్యాలయం**

**మహావృక్షానికి పూసిన**

**అందమైన రాతి పువ్వు ఆర్ట్స్ కాలేజి**

**చరిత్ర పొరలను చీల్చుకొని వచ్చిన కన్నీటి నవ్వు ఆర్ట్స్ కాలేజి."** అంటూ ఒక పూర్వ విద్యార్థి అపూర్వజ్ఞాపకాలను కవిత్వమై పలవరించాడు. నిజమే ఆర్ట్స్ కాలేజీ అంటే కళాత్మక వ్యక్తీకరణ. ఆర్ట్స్ అంటే కళలు అని అర్థం. కళ అంటే సాహిత్యమని విస్తృత అర్థం. సాహిత్యానికి విడి అస్తిత్వం ఉండదు, అది సమాజ జీవనాడులతో పురుడు పోసుకుంటుంది. అందుకే ఆర్ట్స్ కాలేజీలో సామాజిక శాస్త్రాలు సాహిత్యంతో సహవాసం చేసాయి. ఇవ్వాళ ఆర్ట్స్ కాలేజీ అంటే సాహిత్యం, సామాజిక శాస్త్రాల మేలు కలయిక.

ఏ ఉషోదయాన నైజాం ఆర్ట్స్ కళాశాలకు పురుడు పోసాడో కానీ, అదొక సుందర ప్రాకృతిక దృశ్యంగా తెలంగాణ ఎద మీద రెపరెపలాడుతున్నది. దాని నిర్మాణ సౌందర్యానికి ఎవరైనా పరవశించవలసినదే. అది మౌనంగా నిలబడిన కళాత్మక దృశ్యం. చారిత్రాత్మక అపురూప కట్టడం. ఎందరో మన తాతముత్తాతలు ఈ సుందర శిల్పాలను ఒక్కొక్కటిగా పేర్చి అద్భుత కళాఖండంగా రూపొందించారు. వారి కన్నీటి జ్ఞాపకాలను ఈ రాళ్లు తమ దోసిళ్లలో దాచుకున్నాయి. వారి మౌన నిష్క్రమనకు ఈ కళాశాల సజీవ సాక్ష్యం.

ఇదిగో చూడండి, పచ్చిక బయళ్లలో వయ్యారంగా కదులుతున్న గడ్డిపరకలు జ్ఞానంతో పదునెక్కాయి. ఒక్కో మెట్టు ఎందరో మేధావులకు ఆలంబనగా ఉండింది. ఈ తరగతి గదుల నాలుగుగోడలు దేశ గత వర్తమానాలను నిర్మాణం చేసాయి. కవులను, కళాకారులను, సామాజిక శాస్త్రవేత్తలను, రాజకీయ నాయకులను, క్రీడాకారులను ఎందరినో ఈ దేశానికి అందించిన చదువుల తల్లి ఆర్ట్స్ కాలేజి. తన బిడ్డలను విశ్వవ్యాపితం చేసి జ్ఞాన విత్తనాలను వెదజల్లుతున్నది. ప్రపంచంలో తన అస్తిత్వాన్ని నిరంతరం కాపాడుకుంటున్నది.

ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఆర్ట్స్ కళాశాల సర్వనామం, అది ఆర్ట్స్‌కళాశాల ద్వారానే వ్యక్తమవుతున్నది. మన విశ్వవిద్యాలయం దేశంలో ఉత్తమశ్రేణి యూనివర్సిటీలలో 10వ స్థానాన్ని పొందడానికి ఆర్ట్స్ కాలేజి పాత్రను విస్మరించలేము. అందుకే ఓయూ నాక్ ఎ+ గ్రేడ్‌ను తన సొంతం చేసుకున్నది. దేశంలో స్వయం సమృద్ధి పొందిన అద్భుత విశ్వవిద్యాలయాలలో ఒకటిగా నిలిచింది. ఇంతటి కీర్తిని తన సొంతం చేసుకోవడంలో అధ్యాపకులు, విద్యార్థులు, అధ్యాపకేతరులు చేసిన కృషిని వెలకట్టలేము. అధ్యాపకులు తమ మేధస్సును రంగరించి నాణ్యమైన బోధన, పరిశోధన చేసి జ్ఞానవిలువలను నెలకొల్పారు. విద్యార్థులు తమ శక్తినంతా ధారపోసి ఉత్తమ ప్రతిభను ప్రదర్శించారు. దేశ విదేశాలలో ఓయూ కీర్తి పతాకను రెపరెపలాడించారు.

ఓయూలో చదువుకున్న విద్యార్థులు తరగతిగదులకు మాత్రమే పరిమితం కాకుండా సామాజిక చలనంలో భాగమయ్యారు. తమ సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తూ దేశభక్తిని చాటారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన జాతీయోద్యమంలో భాగంగా వందేమాతర నినాదాన్ని ఆర్ట్స్ కాలేజి సాక్షిగా విన్పించారు. నిజాం వ్యతిరేక పోరాటంలో

ప్రజలకు బాసటగా నిలబడ్డారు. తెలంగాణ స్వరాష్ట్రం కోసం రెండు సందర్భాలలో తమ అపురూపమైన ప్రాణాలను బలిదానం చేసారు. ఆనాటి విద్యార్థులు ఎన్ని ఉద్యమాలు చేసినా అకడమిక్ విషయాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. విద్యా వాతావరణానికి భంగం కలిగించే పనులు చేయలేదు. వ్యక్తిగత అడంబరాలకు పోలేదు.

దేశంలో వచ్చిన చాలా పరిణామాల వలన మన విశ్వవిద్యాలయం, ముఖ్యంగా ఆర్ట్స్ కళాశాల వైభవం మసక బారుతూ వస్తున్నది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. అయితే అధ్యాపకులుగా, విద్యార్థులుగా మనం కూడా కారణం కాకూడదని భావిస్తున్నాం. మన తల్లిని మనమే కాపాడుకోవాలి. రక్షించుకోవాలి. రాబోయే మన తర్వాతి తరాలకు అందమైన కానుకగా ఇవ్వాలి. ఆర్ట్స్ కళాశాలకు, ఓయూకు సంబంధం లేని అనేక కార్యకలాపాలకు గత పదేళ్లుగా ఆర్ట్స్ కాలేజీ వేదికగా మారింది. బయటివాళ్లు వచ్చి సభలు నిర్వహించడం, ధర్నాలు చేయడం, క్యాలెండర్, వాల్‌పోస్టర్లు ఆవిష్కరించడం, పుట్టిన రోజు వేడుకలు జరపడం, పెద్ద పెద్ద ఫ్లెక్సీలు ఆర్ట్స్ కాలేజీ భవనానికి వేలాడదీయడం, నిరసన ప్రదర్శనలు చేయడం, క్లాసులకు ఇబ్బంది కలిగించేలా సౌండ్ బాక్సులు పెట్టడం చేస్తున్నారు. ఇలాంటి నాన్ అకడమిక్ కార్యకలాపాలు సామాజిక మాధ్యమాల ద్వారా సమాజంలోకి వెళ్లటం వలన మన విశ్వవిద్యాలయ వైభవం దిగజారుతున్నది. ఇందులో విద్యార్థుల భాగస్వామ్యం ఎక్కువగా ఉంటున్నది. ఫలితంగా విద్యా వాతావరణం దెబ్బతిని ఆర్ట్స్ కాలేజీ అంటే ఉద్యమాలకు నిలయం అనే దృష్టి పౌరసమాజంలో ఏర్పడింది. విద్యాభ్యాసం కోసం ఇక్కడికి తమ పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు ఆసక్తిని చూపడం లేదు. మధ్యతరగతి కుటుంబాల నుంచి ఎదిగిన తెలంగాణ మొదటితరం విద్యార్థులు ఓయుకు రావడానికి వెనకా ముందు ఆలోచిస్తున్నారు. వారంతా ఉన్నత విద్యను చదువుకోవడానికి ప్రైవేట్ విశ్వవిద్యాలయాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా దేశంలో వివిధ సంస్థలు ఇచ్చే ర్యాంకింగ్‌లో కూడా మనం వెనుకబడిపోతున్నాం.

ప్రియమైన విద్యార్థులారా, మనం ఓయూ ఘనతను, ఆర్ట్స్ కాలేజీ కీర్తిని కాపాడుకోవాలి. మనకు చదువునేర్పి, జ్ఞానాన్ని, గుర్తింపునిచ్చిన మన తల్లి ఆర్ట్స్ కాలేజీ ఔన్నత్యాన్ని నిలబెట్టడం మనందరిని బాధ్యత. నీడనిచ్చిన చెట్టును కొట్టి వేస్తే మాతృద్రోహం చేసిన వారమవుతాం. అందుకే విశ్వవిద్యాలయం పాలకమండలి ఈ విషయం మీద చర్చించి ఆర్ట్స్ కాలేజీ ముందు విద్యా సంబంధం లేని కార్యకలాపాలను నిషేధించాలని నిర్ణయం తీసుకున్నది. తెలంగాణ ప్రాంతం నుంచి రాబోయే తరాలకు ఈ వారసత్వ సంపదను కాపాడి నిలబెట్టాలంటే ఇలాంటి నిర్ణయం చేయక తప్పలేదు. అదే సమయంలో విద్యార్థులు నిర్మాణాత్మకమైన తమ అసమ్మతిని ప్రకటించడానికి మరో ప్రత్యామ్నాయ వేదికను కల్పించాలని కూడా పాలకమండలి భావించింది. ఆర్ట్స్ కాలేజీ లాంటి చారిత్రక కట్టడాలను కాపాడటం కూడా పౌరులుగా మన ప్రాథమిక విధి. చారిత్రక కట్టడాల చుట్టూ ఎలాంటి ప్రకంపనలు సృష్టించే కార్యకలాపాలు చేయకూడదని సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు జారీచేసిన విషయం కూడా మీకు తెలియనిది కాదు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ చట్టం ఫ్లెక్సీలు కట్టడాన్ని కూడా నిషేధించింది.

ఈ నేపథ్యంలో మన నేలను కాపాడుకుందాం. జ్ఞానానికి దారులు వేద్దాం. అకడమిక్స్‌లో అద్భుత విలువలను నెలకొల్పిన ఉస్మానియా విశ్వవిద్యాలయం గత వైభవాన్ని పునరుద్ధరించడానికి చేయి చేయి కలుపుదాం. ఆర్ట్స్ కాలేజీ చదువుల తల్లి కడుపులోకి ప్రవేశిస్తూ బంగారు భవిష్యత్‌ను నిర్మించుకుందాం.